ఆమె చాలా మెటీరియలిస్టిక్‌గా ఆలోచిస్తోంది తప్ప ప్రేమ విషయంలో ఆట పట్టించడం లేదని ఊహించలేకపోతున్నాడు "అంటే మన ప్రేమ" గొణిగాడు తలవంచుకునే.

నవ్వేసింది. అతడి మనోభావాల్ని పూర్తిగా అర్థం చేసుకున్నట్టు "పిచ్చి మనూ! నువ్వు రచయితవై ఎంత పొరపాటు చేశావో ఇప్పుడు నా కర్థ మైంది. నీ ఇమేజినేషన్స్, నీ యిల్యుషన్సూ ఎంతవరకు ప్రయాణం చేస్తున్నాయి అంటే అప్పటి మన స్నేహంతో నన్ను పెళ్ళికూడా చేసుకోవాలనుకుంటున్నావు, డోంట్యూ థింక్ ఇట్స్ రెడిక్యులస్!.. నన్ను చెప్పనియ్ మనూ! ప్రతి ప్రాణికి వయసుకు తగ్గ కొన్ని అభిరుచులుంటాయి. యస్! నిజమే. చిన్నతనంలో కాలువలో కొట్టుకుపోయే తాటిపండు కోసం దూకి సాహసం చేసి మరీ తెచ్చుకోవాలనిపిస్తుంది. చెట్టు ఆకుపై వాలిన తూనీగ తోకకు దారం కట్టి ఆడుకోవాలనిపిస్తుందిఅంటే ఎల్లకాలం మనం అలాగే ప్రవర్తిస్తామని అర్థం కాదుగా, వయసుతోపాటు ఇష్టాలు మారతాయి పెరిగే మనసు ప్రాక్టికల్‌గా ఆలోచిస్తుంది దట్స్ లైఫ్!"

అనూహ్యమయిన షాక్ నుంచి ఇంకా తేరుకోలేనట్టు అలాగే నిలబడిపోయాడింకా. చెట్టుపై ఎప్పుడో రాయబడిన 'రతీ మన్మధుల పెళ్లంట' ఎగతాళి చేస్తున్నట్లుగా కనిపిస్తుంది.

"మనూ! నీ కిష్టమైనట్టు పాత్రల్ని సృష్టించి వాటిని నీ కిష్టమైనట్లు నడిపిస్తూ మంచి రచయితవై పోయావు.... అలా అని నీ యిష్ట ప్రకారం నడవటానికి నేను నీ పాత్రని కాదుగా. పాత స్నేహితురాల్ని. చించెయ్! నీ ఆలోచన పుటల్లో ఎక్కడన్నా ఇంకా నా రూపం మిగిలివుంటే తుడిచి పెట్టి మరో అమ్మాయిని పెళ్ళి చేసుకుని సుఖంగా బ్రతుకు."

ఈ సారి అతడి కళ్ళ నుంచి నీళ్ళు చెంపలపైకి జారాయి. "గాడ్! ఏం మనిషి నువ్వు మగాడి వయ్యుండి ఆ కన్నీళ్ళేమిటి! నాకు తెలియకడుగుతాను. నీ స్టేటసేంటి మనూ. నువ్వు ఓ ఏడాది కష్టపడి సాహిత్యం పై నేనో నెలకి ఖర్చుచేసే కాస్మటిక్స్‌కి సరిపోదే. ఎలా నిన్ను పెళ్ళి చేసుకుంటాననుకున్నావు? ఇట్స్ సింపుల్ లాజిక్!".

వెళ్లబోతూ ఆగింది "నేను భాషా ప్రవీణను కాబట్టి ఇలాంటి సన్నివేశాన్ని చదవటంలో థ్రిల్ ఫీలవుతాను. నిజం నేను ఓరియంటల్ కాలేజీలో చేరింది అందుకే. అలా అని మోడరన్ థింకింగ్ లేని ఆడపిల్లని ఎలా అనుకున్నావు. అత్తయ్యగార్ని అడిగానని చెప్పు. పాపం ఆరోగ్యం బాగా లేదన్నావుగా. చివరిగా ఒక్కమాట, ఎవరన్నా చెబితే అది వార్త. నీ అంతట నువ్వు తెలుసుకుంటే అది నిజం. అదే ఇప్పుడు నేను పర్సనల్‌గా
తెలియజేసింది కూడా"

వెళ్ళిపోయింది మామూలుగా.

చెట్టుమొదల్న మన్మధరావు వుండిపోయాడు చాలాసేపటిదాకా.

"ఎవరన్నా చెబితే అది వార్త. నీ అంతటా నువ్వు తెలుసుకుంటే అది నిజం."

ఈ వాక్యం నానీకి పూర్తిగా అర్థం కాలేదు. కొంత అర్థ మైంది. అదికాదు, నానీని ఆ క్షణాన ఏ కొద్దిగానయినా కలవరపరిచింది.

తను కొన్ని గంటలపాటు తాతయ్య చెప్పిన కథలో లాంటి మనుషుల్ని చూశాడు. కాని ఇపుడు జరిగిన కథ తాతయ్య చెపిన కథంత ఆనందాన్నివ్వలేదు. ఏదో వెలితి రసాభాసం చెందిన ఓ శృంగార కావ్యమని గుర్తించేటంత వయసు లేకపోయినా చాలా చాలా అసంతృప్తుడిలా 'అంకుల్'ని సమీపించబోయాడు.

సరిగ్గా అప్పుడే ఓ చేయి బలంగా నానీ పెదవుల్ని మూసింది.

ఉలిక్కి పడుతూ తల పైకెత్తి చూశాడు.

రాజారావుతోపాటు ఇద్దరు దృఢకాయులూ అప్పటికే నానీని పైకెత్తుతున్నారు.

గింజుకున్నాడు కాని మూలుగు సైతం వినిపించకుండా చేతుల్ని మరింత గట్టిగా బిగించారు.

తెలిసిపోయింది నానీకి అదే తన చివరి క్షణాలని.

బ్రతికించే మందిస్తానన్న అంకుల్ ఇంక తేరుకోకపోవడం నానీ చేసుకున్న దురదృష్టం.

అప్పటికే నానీని వందడుగుల దూరం మోసుకుపోయారు.

రాజారావు పెనుగులాడుతున్న నానీని సరిగ్గా పట్టుకోడానికన్నట్టు కొద్దిగా చేయి సడలించాడు.

అంతే....

ఆ అవకాశం జారవిడుచుకోలేదు నానీ.

'అంకుల్' అంటూ గట్టిగా అరిచాడు.

ఆ అరుపు మన్మధరావుని తట్టి లేపింది.

ఉన్మాదిలా మారిన రాజారావు నానీని నేలపైన విసిరి కంఠాన్ని బిగించి పట్టుకున్నాడు.... ఇక అరిచే అవకాశమివ్వకుండా నాని కథ ముగించాలని.

నానీ కళ్ళు తేలేస్తున్నాడు.

అప్పుడు వినిపించింది 'దబ్' మన్న చప్పుడు.

రాజారావు పక్కకి పడిపోయాడు.